క్లుప్తంగా

ఘనంగా పరదేశమ్మ జాతర



పూజలందుకున్న పరదేశమ్మ

అగనంపూడి: అగనంపూడి గ్రామదేవత బొడ్డమాంబ జాతర మహోత్సవాల్లో భాగంగా పరదేశమ్మ పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి తెల్లవారుజాము నుంచి భక్తులు పూజలు చేశారు. పసుపు, కుంకుమ, చీరసారెలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగించి అనుపు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు సరకుల వితరణ



బియ్యం, ఇతర సరుకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న అగనంపూడి ప్రాంతంలోని ఐదు నిరుపేద కుటుంబాలకు సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందించింది. పెదమడకలోని ట్రస్ట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు వానపల్లి వెంకటరమణ, నెల్లి తులసి, ఆర్.సత్యశ్రీ లక్ష్మి, మారా మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభావంతులకు సత్కారం



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న నాయకులు

అగనంపూడి: ఇంటర్ ఫలితాల్లో అగనంపూడి జూనియర్ కళాశాల వరుసగా జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం హర్షణీయమని కళాశాల అభివృద్ధి కమిటీ వ్యవస్థాపక కార్యదర్శి బొండా అప్పారావు అన్నారు. అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదలతో పాటు స్థానికుల ప్రోత్సాహం కూడా అభినందనీయమన్నారు. అలాగే, కళాశాలలో ఎంపీసీలో అత్యధిక మార్కులు సాధించిన సనా పావని (948), బెజ్జపు శ్రావ్య (931) నెమల విమల (420)ను ఆయన అభినందించారు. విద్యార్థులతో పాటు కళాశాల నూతన ప్రిన్సిపాల్ గొల్లపల్లి సుధాకర్ బాబును సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు తోకాడ రాము, కొలిపాక అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను హరించేందుకే ప్రైవేటీకరణ



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల, నిర్వాసితుల హక్కులను హరించేందుకే స్టీల్‌ప్లాంట్ పరిశ్రమను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్రప్రభుత్వం పావులు కదుపుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్ ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1160వ రోజు స్టీల్‌ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను దేశంలో అగ్రగామిగా నిలిపితే, నేడు కేంద్రప్రభుత్వం తన స్వార్థం కోసం పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని చూడడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేసి, కేంద్రప్రభుత్వం ప్రైవేటీకరణను ఉపసంహరించుకునేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

జనం గుండెల్లో జగన్ పదిలం

- అభివృద్ధి, సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష
- రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్
- 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1లో ముమ్మర ప్రచారం



దువ్వాడ సెక్టార్–1లో ప్రచారం చేస్తున్న మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్



మహిళకు కరపత్రం అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్



బడ్డీ నిర్వాహకురాలిని ఓటు అభ్యర్థిస్తున్న అమర్



చంటిబిడ్డతో ప్రచారంలో పాల్గొన్న అభిమాని

అగనంపూడి: సంక్షేమ ప్రదాతగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని దక్కించుకున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి, గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిన ఆయన్ను ప్రజలు దేవుడిలా కొలుస్తున్నారన్నారు. ఆ పథకాలే మాకు శ్రీరామరక్షగా నిలుస్తున్నాయని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 88వ వార్డు దువ్వాడ సెక్టార్–1లో అమర్‌నాథ్ మంగళవారం పర్యటించారు. అమర్‌కు అడుగడుగునా విశేష ఆదరణ లభించింది. మండుటెండలను సైతం లెక్క చేయకుండా మేం సిద్ధం అంటూ మహిళలు, అభిమానులు ప్రచారంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అమర్‌నాథ్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అవకాశాలెన్నో కల్పించారన్నారు. అందుకే ఆయన్ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని, రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

‘ఈ ప్రాంతానికి మా తాతయ్య గుడివాడ అప్పన్న, తండ్రి గురునాథరావు చేసిన సేవలను ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదు. ‘గుడివాడ’ బిడ్డను గెలిపించుకుంటాం’ అంటూ ఓటర్లు చెబుతుండడం ఆనందాన్ని కలిగిస్తోందని అమర్‌నాథ్ అన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, పార్టీ వార్డు ఇన్‌చార్జి గండ్రెడ్డి కనక మహాలక్ష్మినాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ వీవీఎస్ఎం రాజు, గాజువాక జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, మాజీ కార్పొరేటర్ చొప్పా నాగరాజు, దాడి నూకరాజు, చట్టి తాతారావు, శేఖరమంత్రి శ్రీనివాసరావు, నమ్మి ప్రసాద్, రాము, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి కట్టుబడిన సీఎం జగన్

- హామీలను శతశాతం నెరవేర్చిన ముఖ్యమంత్రిగా చారిత్రాత్మక ఖ్యాతి
- ఆయన మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి
- మంత్రి అమర్‌నాథ్ సోదరి సురేఖ



సమావేశంలో మాట్లాడుతున్న సురేఖ



సమావేశానికి హాజరైన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

కూర్మన్నపాలెం: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కట్టుబడి ఉన్నారని రాష్ట్ర మంత్రి, గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ సోదరి సురేఖ అన్నారు. ఎన్నికల హామీలను శతశాతం నెరవేర్చిన సీఎంగా చరిత్రలో నిలిచిపోతారని అన్నారు. అటువంటి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. 86వ వార్డులోని వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో పార్టీ వార్డు ఇన్‌చార్జి, విశాఖ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు ఆధ్వర్యంలో వార్డు ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గుడివాడ అమర్‌నాథ్ ప్రజల కోసం ఎన్నో సేవాకార్యక్రమాలు చేపట్టారన్నారు. అటువంటి వ్యక్తి ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. గాజువాక ఎమ్మెల్యేగా అమర్‌నాథ్, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీలను అత్యధిక మెజార్టీతో గెలిపించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వీవీఎస్ఎం రాజు, పార్టీ వార్డు అధ్యక్షుడు వెలుగుల పరశురాముడు, జిల్లా కార్యదర్శి చేగొండి శ్రీనివాస్ పట్నాయక్, వార్డు మహిళాఅధ్యక్షురాలు నిర్మలమ్మ, మాటూరి శ్రీనివాసరావు, పరదేశి, కన్వీనర్లు బాలకృష్ణ, వరలక్ష్మి, పత్తిపాటి శ్రీనివాసులు, దేవా, పెంటారావు, సాయి, హరీష్, నరేంద్ర, సత్యనారాయణ, జీవన్, ప్రసాద్, వార్డు వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అమర్‌కు అండగా నిలవండి

మంత్రి అమర్‌నాథ్ భార్య హిమగౌరి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న హిమగౌరి

పెదగంట్యాడ: వైఎస్సార్ సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌కు ఓటేసి గెలిపించాలని గుడివాడ అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి కోరారు. 76వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో వార్డు పరిధిలోని నడుపూరులోని కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాజువాకను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు అమర్‌నాథ్‌కు అండగా నిలవాలన్నారు. మహిళల సంక్షేమం కోసం పాటు పడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. విశాఖ ఎంపీగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మికి ఓటు వేయాలని అభ్యర్థించారు. సమావేశంలో మంత్రి రాజశేఖర్, రంబ నారాయణమూర్తి, మంత్రి శంకరనారాయణ, చిక్కా సత్యనారాయణ, పరంకుశం ప్రమీల, తాటికొండ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతికి ఆస్కారం లేని పారదర్శక పాలన

- కొనసాగించేందుకు మళ్లీ వైఎస్సార్‌సీపీనే గెలిపిద్దాం
- 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష



సమావేశంలో మాట్లాడుతున్న 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష



సమావేశానికి హాజరైన మహిళలు

అక్కిరెడ్డిపాలెం: కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అని 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష అన్నారు. గతంలో చంద్రబాబు పరిపాలనలో జన్మభూమి కమిటీలు ప్రజలను పీక్కు తిన్నాయని.. ఆ కష్టాల నుంచి విముక్తి కల్పించి, అవినీతి రహిత పాలన అందిస్తున్న జన నేత మన జగనన్న అన్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో డ్వాక్రా సభ్యులు, స్థానిక మహిళలతో ఆమె సమావేశం నిర్వహించారు. నవరత్నాల ద్వారా మహిళలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా అవినీతికి తావులేకుండా నేరుగా బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. మహిళలు ఆనందంగా ఉంటే కుటుంబమంతా సంతోషంగా ఉంటుందని నమ్మే వ్యక్తి మన ముఖ్యమంత్రి అన్నారు. కరోనా కష్టకాలంలో వలంటీర్ల ద్వారా సేవలందించి లక్షలాది మంది ప్రాణాలు కాపాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక వలంటీర్ల సేవలను ఆపించి, అవ్వాతాతలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న సైకో చంద్రబాబు అని విమర్శించారు. వారికి ఓట్లతోనే బుద్ధి చెప్పాలని కోరారు. గుడివాడ కుటుంబం సేవాగుణానికి మారుపేరని, ఆ కుటుంబం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న అమర్‌నాథ్‌ను గెలిపించాలని కోరారు. ఎంపీగా బొత్స ఝాన్సీ విజయానికి సహకరించాలని కోరారు. పార్టీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ మాట్లాడుతూ తమ తాత గుడివాడ అప్పన్న, చిన్నాన్న గురునాథరావు పెందుర్తి, గాజువాకతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మంత్రిగా గుడివాడ అమర్‌నాథ్ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి పాటు పడ్డారన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, అమర్‌నాథ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సంగ్రాన నూకరాజు, గొంతిన శ్రీనివాసరావు, శ్రీనివాస రెడ్డి, కాదా సత్యారావు, ఎం.సత్యవతి, కె. శ్రీనివాసరావు, అరుణ, శ్రీనివాసరావు, సతీష్, బి.రమణ తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణానికి వేళాయె..



అక్కిరెడ్డిపాలెం రామాలయంలో కల్యాణ మహోత్సవానికి సిద్ధం చేస్తున్న వేదిక

అక్కిరెడ్డిపాలెం: సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆలయాలన్నీ ముస్తాబవుతున్నాయి. శ్రీరామ నవమిని పురస్కరించుకుని అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా సన్నాహాలు చేస్తున్నారు. 78వ వార్డులో అక్కిరెడ్డిపాలెం, మింది, గుడివాడ అప్పన్నకాలనీ, రాంనగర్, 69వ వార్డులోని షీలానగర్, నాతయ్యపాలెం, హరిజన జగ్గయ్యపాలెం, తుంగ్లాం, ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం తదితర ప్రాంతాల్లోని రామాలయాల్లో కల్యాణ వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఆలయాలను సర్వాగ సుందరంగా అలంకరించారు. కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరు కానున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాల ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

‘ఉక్కు’కు కోల్ పునరుద్ధరించాలి

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు వెంటనే కోకింగ్ కోల్ సరఫరాను పునరుద్ధరించాలని ఆలిండియా బ్రాహ్మణ ఫెడరేషన్ రాష్ట్ర సమన్వయకర్త ధర్మాల వ్యాసశర్మ ఒక ప్రకటనలో కోరారు. ఈ విషయంలో కేంద్రం తక్షణం స్పందించాలని పేర్కొన్నారు. గంగవరం పోర్టు వల్ల విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నష్టం వాటిల్లితే తమకు సంబంధం లేదని కేంద్ర ప్రభుత్వం చెప్పడం చూస్తుంటే ఆదానీకి స్టీల్‌ప్లాంట్‌ను అప్పజెప్పాలనే ఆతృత కనపడుతోందని ఆరోపించారు. వెంటనే కోల్ రవాణాకు మార్గం సుగమం చేయాలని కోరారు.

కిమ్స్ ఐకాన్‌లో ఉచిత గ్రహణం మొర్రి శస్త్రచికిత్సలు



మాట్లాడుతున్న డాక్టర్ నితిన్ దోషి

అక్కిరెడ్డిపాలెం: గ్రహణం మొర్రితో బాధపడే వారికి షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సతీష్‌కుమార్ పెతకంశెట్టి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ టి.సాయి బలరామకృష్ణ తెలిపారు. ఇంగా హెల్త్ ఫౌండేషన్, దోషి స్మైల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు చెప్పారు. ఆస్పత్రి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. 3 నెలల నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు గల గ్రహణం మొర్రి వ్యాధిగ్రస్తులకు సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చయ్యే ఈ శస్త్రచికిత్సను ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. ఈ శస్త్రచికిత్సకు సరైన సౌకర్యాలు గల ఆస్పత్రిగా కిమ్స్ ఐకాన్‌ను అమెరికా, ముంబయి నుంచి వచ్చిన దోషి వైద్యబృందం ఎంపిక చేసుకుందని చెప్పారు. వారం రోజుల్లో ఆపరేషన్ల ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రహణం మొర్రి శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ నితిన్ దోషి, డాక్టర్ లీనా దోషి, డాక్టర్ కృష్ణ శామరావు, డాక్టర్ చేతన్, శ్యామ్ షేత్, డాక్టర్ వై.ఎస్.ఎన్.రెడ్డి, కిమ్స్ ఐకాన్ వైద్యులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి సహకరించండి

కలెక్టర్‌కు కార్మిక సంఘాల వినతి



కలెక్టర్‌కు లేఖ అందిస్తున్న స్టీల్‌ప్లాంట్ కార్మిక నాయకులు

ఉక్కునగరం: ఉక్కు ఉత్పత్తికి అవసరమైన కోల్, కోక్ సరఫరా సక్రమంగా చేసేలా చర్యలు తీసుకోవడం ద్వారా స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి సహకరించాలని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నాయకులు కలెక్టర్ మల్లికార్జునను కలిసి, వినతిపత్రం అందజేశారు. గత వారం రోజులుగా గంగవరం పోర్టు ప్లాంట్‌కు కోల్, కోక్ సరఫరా నిలిపి వేసిందన్నారు. ఫలితంగా ఉక్కు ఉత్పత్తి పడిపోయిందన్నారు. కోల్ సరఫరా లేకపోవడం వల్ల కోక్‌ఓవెన్స్ నుంచి సరిపడా గ్యాస్ ఉత్పత్తి కాకపోవడంతో ఇతర ఉత్పత్తి విభాగాల్లోనూ ఉత్పత్తికి అంతరాయం కలుగుతోందని, తద్వారా మరింత నష్టాల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ విషయంలో జోక్యం చేసుకుని ప్లాంట్‌ను రక్షించాలని లేఖలో కోరారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, జె.అయోధ్యరామ్, కె.దాలినాయుడు, సురేష్‌బాబు, డేవిడ్, వరసాల శ్రీనివాసరావు, సన్యాసిరావు, కొమ్మినేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మీరే మా స్టార్ క్యాంపెయినర్లు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్



సమావేశానికి హాజరైన మహిళలు

- మహిళా బలం పార్టీ విజయానికి దోహదం
- మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్
- రేపటి నుంచి మహిళల ఇంటింటి ప్రచారం

గాజువాక : ‘మహిళలే మన పార్టీ స్టార్ క్యాంపెయినర్లు.. గాజువాకలో మహిళా శక్తి మిగతా నియోజకవర్గాలకు స్ఫూర్తిగా నిలవాలి. ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం కష్టపడి పని చేయండి. పార్టీ మీకెప్పుడూ అండగా ఉంటుంది’ అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి, ఆ పార్టీ గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ కోరారు. గాజువాక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మహిళా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మరో 25 రోజులపాటు జగన్‌మోహన్‌రెడ్డి కోసం మనమంతా కష్టపడాలని కోరారు.

18 నుంచి ప్రచారం

ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు ప్రతీ వార్డులో ఉన్న మహిళలు ఆయా సచివాలయాల పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గడిచిన ఐదేళ్లలో ప్రజలకు చేసిన మేలు ఈ ప్రచారంలో వివరించాలన్నారు. మళ్లీ ఆయన అధికారంలోకి వస్తే రానున్న ఐదేళ్లలో చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమం కోసం వివరించాలన్నారు. ఈ నెల 26 నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు బూత్‌ల పరిధిలో ప్రచారాలను నిర్వహించాలని అమర్‌నాథ్ సూచించారు. ఏ బూత్‌లో ఉన్న మహిళలు ఆ బూత్ పరిధిలోనే పని చేయాలని సూచించారు. వార్డు ఇన్‌చార్జులను, అధ్యక్షులను ఈ ప్రచారానికి ఆహ్వానించాలన్నారు.

ప్రతీ ఆదివారం భారీ ర్యాలీ

గాజువాకలో మహిళా బలం పార్టీ విజయానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తన కోసం కష్టపడుతున్న మహిళలను ఎప్పటికీ గుర్తుంచుకుంటానని, తనను గెలిపిస్తే వారి కోసం ఐదేళ్లపాటు కష్టపడతానని చెప్పారు. ప్రతీ ఆదివారం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో భారీ ర్యాలీలు నిర్వహించనున్నామని చెప్పారు. జగన్ మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని ప్రతీ ఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిరండి..

గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను ఈ నెల 24న నామినేషన్ వేయనున్నట్టు పరిశ్రమల శాఖమంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. మహిళలు వేలాదిగా తరలి వచ్చి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నిర్వాసితులకు మేలు చేసేది వైఎస్సార్‌సీపీనే

ఆత్మీయ సమావేశంలో మంత్రి అమర్‌నాథ్



మాట్లాడుతున్న అమర్‌నాథ్



పాల్గొన్న కార్యకర్తలు, అభిమానులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్ నిర్వాసితులు, ఫార్మాసిటీ నిర్వాసితులకు అప్పట్లో వైఎస్సార్, నేడు ముఖ్యమంత్రి జగన్ వల్లే మేలు జరిగిందని రాష్ట్ర ఐటీ శాఖామంత్రి, గాజువాక వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. 85వ వార్డు అగనంపూడిలో వార్డు కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు నిరసనగా అసెంబ్లీలో తీర్మానం చేయడంతో పాటు, జీవీఎంసీతో సహా రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థలతో తీర్మానాలు చేయించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అన్నారు. ఉక్కును పరిరక్షించాలంటే ముఖ్యమంత్రి జగన్ వల్లే సాధ్యమని, మళ్లీ ఉక్కుకు పూర్వవైభవం రావాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు.

దీర్ఘకాల సమస్యల పరిష్కారం: కర్ణవానిపాలెం అపరిష్కృత సమస్య, ఫార్మా మేజర్ సస్స్ పట్టాల సమస్య దీర్ఘకాలంగా నలుగుతూ ఉంటే పరిష్కరించింది కూడా వైఎస్సార్‌సీపీ మాత్రమే అన్నారు. నిర్వాసిత కాలనీల అభివృద్ధి, నిర్వాసితుల ఉపాధికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్లు ఉరుకూటి చందు, ఇల్లపు వరలక్ష్మి, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ఇల్లపు ప్రసాద్, పూర్ణానందశర్మ, అప్పికొండ మహాలక్ష్మి నాయుడు, బొడ్డ గోవింద్, బలిరెడ్డి నాగేశ్వరరావు, బోర సోమునాయుడు, పెదిరెడ్ల హరీష్, ఎల్.వి.రమణ, మామిడి శ్రీను, కొశిరెడ్డి రమణారావు, గొలగాని శ్రీను, సమర తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ప్రచారాలు



పాత అగనంపూడి ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



శనివాడలో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

అగనంపూడి: వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్‌లను గెలిపించాలని కోరుతూ 79వ వార్డు అగనంపూడి, షిర్డీసాయి నగర్‌కు చెందిన నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. వార్డులోని బూత్–4 పరిధిలోని ఇంటింటికి వెళ్లిన నాయకులు కరపత్రాలు పంపిణీ చేసి ఫ్యాన్ గుర్తుపై ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గుర్రం శ్రీను, జెర్రిపోతుల సమర, మామిడి శ్రీను, రాము, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

- గళ్లవానిపాలెం, శనివాడ ప్రాంతాల్లోని బహుళ అంతస్తు భవనాల్లో మహిళా నాయకులు ప్రచారం చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ తమ్మిన శ్రీహర్ష, కె.లక్ష్మీప్రసన్న, మామిడి అరుణ, వరప్రసాద్, అరవింద్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం దిగి వచ్చేవరకు పోరాటం

స్పష్టం చేసిన అదానీ గంగవరం పోర్టు కార్మికులు



ఆందోళనలో భాగంగా అదానీ గంగవరం పోర్టు వంతెన వద్ద భోజనాలు చేస్తున్న మహిళలు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు కార్మికుల ఆందోళన మంగళవారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. కార్మికులు తమ కుటుంబాలతో కలసి పోర్టు గేటు వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. మధ్యాహ్నం అక్కడే భోజనాలు చేశారు. గంగవరం పోర్టు నిర్వాసితుల కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ పోర్టు మాదిరిగానే అదానీ గంగవరం పోర్టులో కూడా జీతాలు, ఇతర అలవెన్సులు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయం కల్పించాలన్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం వారం రోజులుగా ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. యాజమాన్యం దిగి వచ్చే వరకూ పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆందోళనకు పలు కార్మిక సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. నిర్వాసిత కార్మికులకు అండగా ఉంటామన్నారు.